క్లుప్తంగా

పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ

కడప అగ్రికల్చర్ : కడప నగర శివార్లలోని ఊటుకూరు కృషి విజ్ఞానకేంద్రంలో ఈ నెల 2వ తేదీ నుంచి 5వ తేదీ వరకు పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కేవీకే జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ వీరయ్య తెలిపారు. ఆసక్తి ఉన్న వారు 9848809236 నెంబర్‌కు కాల్ చేసి పేరు నమోదు చేసుకోవాలని తెలిపారు.

మొక్కలు నాటిన వలంటీర్లు

వైవీయూ : యోగి వేమన విశ్వవిద్యాలయం జాతీయ సేవాపథకం యూనిట్–8 ఆధ్వర్యంలో విశ్వవిద్యాలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ ఎన్ వెంకట్రామిరెడ్డి, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఎస్. సుమిత్ర, 25 మంది వలంటీర్లు పాత సైన్స్ బ్లాక్ ప్రాంతంలో మొక్కలు నాటి నీరు పోశారు. వీటిని సంరక్షించే బాధ్యతను తీసుకుంటామన్నారు.

డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు బదిలీ

కడప కార్పొరేషన్ : కడప నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్‌గా పనిచేస్తున్న పి. శ్రీనివాసరావు బదిలీ అయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అనిల్ కుమార్ సింఘాల్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన్ను గుడివాడ మున్సిపాలిటీ అదనపు కమిషనర్‌గా నియమించిన ప్రభుత్వం కడప కార్పొరేషన్‌లో ఆయన స్థానంలో ఇంకా ఎవరినీ నియమించలేదు.

విజిలెన్స్ సీఐగా హమీద్‌ఖాన్

కడప అర్బన్ : కడప నగరంలోని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐగా హమీద్‌ఖాన్ బాధ్యతలను చేపట్టారు. ఈయన గతంలో టూటౌన్ సీఐగా పనిచేశారు. అనంతపురం జిల్లాలో ఎస్ఐగా, సీఐగా విధులను నిర్వహించారు. ఇటీవల జరిగిన బదిలీలలో ఆయన కడప విజిలెన్స్ సీఐగా పనిచేస్తున్న ఈదురుబాషా స్థానంలో నియమితులయ్యారు. ఈక్రమంలో హమీద్‌ఖాన్ శనివారం బాధ్యతలను చేపట్టారు.

వర్షాల నేపథ్యంలో జాగ్రత్తలు తీసుకోవాలి

కడప కార్పొరేషన్ : రెండు రోజులుగా కడప నగరంలో కురుస్తున్న వర్షం కారణంగా, అందరూ సురక్షితంగా ఉండి అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ వైఓ నందన్ ఒక ప్రకటనలో కోరారు. శానిటేషన్, ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ సంబంధిత సహాయం లేదా అత్యవసర పరిస్థితుల కోసం, కడప మునిసిపల్ కార్పొరేషన్‌లో 24/7 పనిచేసే కంట్రోల్ రూమ్‌ను సంప్రదించాలన్నారు. ఏదైనా సమస్యలు ఏర్పడితే కార్పొరేషన్ కంట్రోల్ రూమ్ నంబర్: 99490 93772కు ఫోన్‌చేస్తే తమ బృందం అందుబాటులో ఉండి సహాయం చేస్తుందని తెలిపారు.

పీడీ సేవలు మరువలేనివి



ఏపీ ఎంఐపీ పీడీ రవీంద్రనాథ్‌రెడ్డి దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

కడప అగ్రికల్చర్ : ఏపీ సూక్ష్మసాగు పథకం (ఏపీ ఎంఐపీ) జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ (పీడీ) మూలి రవీంద్రనాథ్‌రెడ్డి బిందు, తుంపర సేద్యం పథక అమలుకు చేసిన సేవలు మరువలేనివని జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరరావు అన్నారు. కడప జెడ్పీ సమావేశ మందిరిలో శనివారం ఏపీ ఎంఐపీ పీడీ రవీంద్రనాథ్‌రెడ్డి పదవీ విరమణ సభ ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన డీఏఓ నాగేశ్వరరావు మాట్లాడుతూ రవీంద్రనాథ్‌రెడ్డి అంకిత భావంతో విధులు నిర్వర్తించి వ్యవసాయ అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. అన్నమయ్య జిల్లా వ్యవసాయ అధికారి చంద్రనాయక్, అన్నమయ్య, చిత్తూరు ఏపీఎంఐపీ పీడీలు మధుసూదన్‌రెడ్డి, వేంకటేశ్వరరెడ్డిలు మాట్లాడారు. అనంతరం రవీంద్రనాథ్‌రెడ్డి దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానశాఖ అధికారి సుభాషిణి, జిల్లా పశుసంవర్ధశాఖ అధికారి డాక్టర్ శారదమ్మ, ఏపీడీ మురళీమోహన్‌రెడ్డి, విశ్రాంత ఉద్యానశాఖ అధికారులు లక్ష్మీరెడ్డి, మైకేల్‌రాజీవ్ పాల్గొన్నారు.

వీసీని తొలగించాలని తరగతుల బహిష్కరణ



తరగతుల బహిష్కరణకు పిలుపునిస్తున్న ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ నాయకులు

వైవీయూ : వైవీయూ ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ ఆచార్య కె. కృష్ణారెడ్డిని తొలగించాలంటూ ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో వైవీయూలో తరగతుల బహిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి గంగాసురేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శివశంకర్, వలరాజు మాట్లాడుతూ ఆరోపణలు ఉన్న వ్యక్తిని ఎంతో ఉన్నతమైన పదవైన వీసీ స్థానంలో కూర్చోబెట్టడం సరికాదన్నారు. ఆయనపై వచ్చిన ఆరోపణలన్నింటిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. రోజుల తరబడి ఆందోళన చేస్తున్నా ప్రభుత్వానికి చీమ కుట్టినట్లైనా లేదని విమర్శించారు. తరగతుల బహిష్కరణ సందర్భంగా ప్రిన్సిపాల్‌కు, విద్యార్థి సంఘాల నాయకుల మధ్య స్వల్ప వాగ్వాదం చోటు చేసుకుంది.

సాహితీలోకానికి ఘనకీర్తి.. పుట్టపర్తి

నేడు పుట్టపర్తి నారాయణాచార్యుల వర్ధంతి

కడప కల్చరల్ : 12 ఏళ్ల వయస్సులోనే పద్యకావ్యం రచించినదెవరు? తను రాసిన కావ్యమే విద్వాన్ కోర్సులో తనకే పాఠంగా వచ్చిందెవరికి? తను వెలువరించిన లఘుకావ్యమే అనంత కీర్తిని ఆర్జించి పెట్టిందెవరికి? 14 భాషల్లో అసమాన పాండిత్యం గల వారెవరు? సాహిత్యంతోపాటు సంగీతం, నృత్యం, జ్యోతిష్యం లాంటి కళల్లో విశేష ప్రతిభగల వారెవరు? స్వామి శివానంద సరస్వతి 'సరస్వతీ పుత్ర' బిరుదు ఇచ్చినదెవరికి? మన ప్రాంతంలో పద్మశ్రీ సాధించిన కవి ఎవరు...?


ఇలా..ఇలాంటి ప్రశ్నలన్నింటికీ సమాధానం ఒక్కటే..! పుట్టపర్తి నారాయణాచార్యులు. సాహిత్యానికి గడపగా, మన జిల్లాలోని గొప్ప కవుల్లో ప్రథమ స్థానంలో నిలిచే మహాకవి పుట్టపర్తి వర్ధంతి సెప్టెంబరు 1. ఈ సందర్భంగా పాఠకుల కోసం ఆయన గురించి క్లుప్తంగా..

■ శ్రీకృష్ణ దేవరాయల కాలంలో అల్లసాని పెద్దనకు ఎంత గొప్ప పేరుండేదో మన జిల్లాకు చెందిన నిన్నటితరం కవుల్లో పుట్టపర్తి నారాయణాచార్యులు అంతటి పేరు సాధించారు. ఎందరో సాహితీవేత్తలకు స్ఫూర్తినిచ్చిన ఆయన నిరాడంబరత, ఆత్మీయత, ఆత్మాభిమానం, అంతకుమించిన ప్రతిభ ఆయనకు సాహితీలోకంలో విశిష్ఠ స్థానం కల్పించాయి. ఆయన కార్యస్థలం మన జిల్లా కావడం మనందరి అదృష్టంగా చెప్పవచ్చు.

ఎన్నెన్నో విశేషాలు



పుట్టపర్తికి విశేష కీర్తిని ఆర్జించి పెట్టిన శివతాండవం



పుట్టపర్తి రచించిన కావ్యం మేఘదూతము

ఆయన 12 ఏళ్ల వయస్సులో రచించిన పెనుగొండ లక్ష్మి కావ్యం విద్వాన్ చదువుతున్నప్పుడు ఆయనకే పాఠంగా రావడం అపూర్వం. ప్రొద్దుటూరులో ఉన్నప్పుడు అక్కడి శ్రీ అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో ఆయన శివతాండవం కావ్యం రాశారు. అది దేశమంతటా ఎందరో సాహితీ వేత్తలను సైతం ఆయనకు అభిమానులుగా మార్చింది. సంగీత సాహిత్య నృత్యాల సమ్మిళితంగా మాత్రా చంధస్సులో సాగే శివతాండవాన్ని ఆయనే పలు సభల్లో స్వయంగా అభినయంతో ఆలపిస్తుండగా ప్రేక్షకులు మైమరిచిపోయేవారు.

అభ్యుదయం

పుట్టపర్తి నారాయణాచార్యులు సాంప్రదాయ కుటుంబంలో జన్మించినా అభ్యుదయ వాదిగా పేరు గాంచారు. మేఘదూతం, అగ్నివీణ కావ్యాలే ఇందుకు ఉదాహరణలు. తులసీదాసును ఎంత శ్రద్ధగా చదివారో అంతే శ్రద్ధగా ఆయన కారల్‌మార్క్స్‌ను కూడా చదివారు. అప్పట్లో జిల్లాకు చెందిన పలువురు కమ్యూనిస్టులు ఆయనకు అత్యంత ఆప్తులుగా ఉండేవారు. సాహిత్యంలో మక్కువ ఉన్న వారందరినీ ఆయన కులమతాలకు అతీతంగా ప్రోత్సహించేవారు. ఆయన శిష్యుల్లో అన్ని కులాలు, మతాలకు చెందిన వారు ఉండడమే ఇందుకు నిదర్శనం.

విగ్రహం ఏదీ?



పుట్టపర్తి నారాయణాచార్యులు

ఐదేళ్ల క్రితం పుట్టపర్తి జయంతి సందర్భంగా ఆయన విగ్రహాన్ని కడపలో ఏర్పాటు చేయాలని శిష్యులు, అభిమానులు నిర్ణయించారు. ఓ అభిమాని అప్పటికప్పుడు లక్ష రూపాయలు విరాళం ప్రకటించగా, పుట్టపర్తి శిష్యులు షేక్ హుసేన్ సత్యాగ్ని రూ. 5 లక్షలను ప్రభుత్వం నుంచి విడుదల చేయిస్తామని చెప్పారు. అయితే విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో ఆ ప్రయత్నాలు అక్కడితో ఆగిపోయాయి. ప్రొద్దుటూరులో రోడ్డు విస్తరణలో భాగంగా పుట్టపర్తి విగ్రహాన్ని తొలగించగా, ప్రజలు, అభిమానుల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమైంది. అప్పట్లో ఎంపీగా ఉన్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన నిధుల నుంచి రూ. 2 లక్షలు మంజూరు చేశారు. అదే ప్రాంతంలో నిలువెత్తు పుట్టపర్తి శిలా విగ్రహాన్ని ఆ వెంటనే ఆవిష్కరించారు. కానీ ఎన్నో ఏళ్లు కార్యస్థానంగా ఉన్న కడప నగరంలో స్థానిక ప్రజలు, ప్రముఖులు ఆయన విగ్రహాన్ని ఇంతవరకు ఏర్పాటు చేయలేకపోయారు.

కుడా వైస్ చైర్మన్ వైఓ నందన్ బదిలీ

కడప కార్పొరేషన్ : కడప పట్టణాభివృద్ధి సంస్థ(కుడా) వైస్ చైర్మన్‌గా ఉన్న వైఓ నందన్‌ను బదిలీ చేస్తూ ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అనిల్ కుమార్ సింఘాల్ ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా పలువురు కమిషనర్లు, ఆర్‌డీఎంలను శుక్రవారం రాత్రి బదిలీ చేశారు. ఇందులో భాగంగా కుడా వైస్ చైర్మన్‌గా ఉన్న వైఓ నందన్‌ను బదిలీ చేసి సీడీఎంఏలో రిపోర్టు చేసుకోవాలని ఆదేశించారు. కుడా వైస్ చైర్మన్‌గా ఉన్న ఆయన కడప మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కుడా వైస్ చైర్మన్‌గా బదిలీ అయితే ఇక్కడ కూడా అయిన ట్లేనని చెబుతున్నారు. కడప కమిషనర్‌గా వైఓ నందన్‌ను రెగ్యులర్‌గా కొనసాగిస్తారా.. వేరొకరిని నియమిస్తారా అన్నది వేచిచూడాలి.

నగరపాలక ఇన్‌చార్జి ఎస్ఈగా చెన్నకేశవరెడ్డి

కడప కార్పొరేషన్ : కడప నగరపాలక సంస్థ ఇన్‌చార్జి సూపరింటెండింగ్ ఇంజినీర్(పూర్తి అదనపు బాధ్యతలు)గా పబ్లిక్ హెల్త్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా ఉన్న చెన్నకేశవరెడ్డిని నియమించారు. ఈ మేరకు ఈఎన్‌సీ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఎస్ఈగా ఉన్న రత్నాల రాజు శనివారం పదవీ విరమణ చెందడంతో చెన్నకేశవరెడ్డికి ఎఫ్ఏసీ ఇచ్చారు. ఈయన గతంలో కడప కార్పొరేషన్‌లో డీఈగా, ఈఈగా పనిచేశారు.

పాలకొండ్రాయుడికి శ్రావణ పూజలు

కడప కల్చరల్ : కడప నగర శివార్లలోని పాలకొండల్లో వెలిసిన శ్రీ పాలకొండ్రాయస్వామి ఆలయంలో శ్రావణమాసం చివరి శనివారాన్ని పురస్కరించుకుని విశేష పూజలు నిర్వహించారు. ఆలయ పాలనాధికారి, కడప గ్రూప్ ఆఫ్ టెంపుల్స్ ఈఓ శ్రీధర్, అర్చక బృందం ఆధ్వర్యంలో ఉదయం స్వామి, అమ్మవార్లతోపాటు ఆ ప్రాంగణంలోని ఇతర దేవతామూర్తులకు విశేష అభిషేకాలు, అలంకారం చేశారు. నగరం నుంచి వచ్చిన భక్తులు దేవతా మూర్తులను దర్శించుకుని మొక్కులు చెల్లించుకుని పూజలు చేశారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ బి.రెడ్డెయ్య యాదవ్ ప్రత్యేక పూజలు నిర్వహింపజేశారు. అనంతరం హాజరైన భక్తులకు ఆలయం ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఆలయం మెట్ల ప్రారంభం వద్ద ఇందిరానగర్‌కు చెందిన బాలాజీ ఛారిటబుల్ ట్రస్టు చైర్మన్ ఏటూరి రామచంద్రారెడ్డి బృందం అన్నదానం నిర్వహించింది.



విశేష అలంకారంలో శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి



విశేష అలంకారంలో శ్రీ పాలకొండ్రాయస్వామి

పంచముఖ ఆంజనేయునికి పూజలు

స్థానిక నెహ్రూనగర్‌లోని శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో శ్రావణమాసం చివరి శనివారాన్ని పురస్కరించుకుని స్వామికి విశేష పూజలు నిర్వహించారు.

శ్రీ శనీశ్వరునికి పూజలు

కడప కల్చరల్ : శనిత్రయోదశిని పురస్కరించుకుని శ్రీ శనీశ్వరస్వామికి శనివారం కడప నగరంలోని దేవాలయాల్లో విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్థానిక శ్రీ విజయ దుర్గా దేవి ఆలయ ప్రాంగణంలోని నవగ్రహ మండపంలోగల శనీశ్వర స్వామికి తొలుత తైలాభిషేకం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి ప్రత్యేకంగా స్వామికి తైలాభిషేకం నిర్వహించి పూజలు చేశారు. ఆలయ వ్యవస్థాపకులు మల్లికార్జునరావు, రమ్యతారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

■ నగర శివార్లలోని రామకృష్ణనగర్‌లోగల శ్రీ సాయి శనీశ్వరస్వామి ఆలయంలో పూజలు ఘనంగా నిర్వహించారు. ఉదయం 5 గంటల నుంచి భక్తులు స్వామి మూల విరాట్‌కు స్వయంగా తైలాభిషేకం నిర్వహించారు. అర్చకులు శ్రీధర్‌శర్మ ఆధ్వర్యంలో విశేష పూజలు చేశారు.



శ్రీ విజయదుర్గాలయంలో పూజలు నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి

■ కడప నగరం గడ్డిబజారులోని శ్రీ కామకోటి కళాంబ సమేత సోమసుందరేశ్వరస్వామి ఆలయంలో ఉదయం నుంచి గణపతిపూజ, నవగ్రహ మండపారాధన, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, సామూహిక తైలాభిషేకం, మూలమంత్ర జపం, హోమాలు, తిలాదానం, పూర్ణాహుతి నిర్వహించారు.

ప్రజా వినియోగిత సేవల చట్టాలపై అవగాహన

వైవీయూ : ప్రతి ఒక్కరికీ ప్రజా వినియోగిత సేవల చట్టాలపై అవగాహన కలిగి ఉండటం అవసరమని జిల్లా శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ స్వర్ణప్రసాద్ సూచించారు. శనివారం కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రజా వినియోగిత సేవలు, లీగల్ లిటరసీ, డొమెస్టిక్ వయలెన్స్ తదితర అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వర్ణప్రసాద్ మాట్లాడుతూ పర్మినెంట్ లోక్ అదాలత్ ద్వారా ఫిర్యాదుదారులు ఎలాంటి కోర్టు ఖర్చులు లేకుండా సత్వర న్యాయపరిష్కారం అందుతుందని తెలిపారు. పర్మినెంట్ లోక్‌అదాలత్ అందించే తీర్పు భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఇచ్చే తీర్పుతో సమానమన్నారు. లోక్‌అదాలత్‌లో పరిష్కారం కాని మరిన్ని సమస్యలను ఈ పర్మినెంట్ లోక్‌అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చన్నారు. పూర్తి వివరాలకు 8639684279, 9963731698 నెంబర్లలో సంప్రదించాలని కోరారు. అనంతరం శాశ్వత లోక్‌అదాలత్ ద్వారా పరిష్కారం కాదగిన ప్రజాప్రయోజిత సేవల కార్యక్రమాల గురించి వివరించారు. అనంతరం కాంపిటీషన్‌లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా. వేమల సలీంబాషా, హిందీ విభాగాధిపతి డా. జయంతి, డీపీఎండీబీసీఎస్ బి. సునీత, రవికుమార్, సుధాకర్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ స్వర్ణప్రసాద్

యువతరంపై ఆరుద్ర ముద్ర

కడప కల్చరల్ : యువతరంపై శ్రీశ్రీ అనంతరం ఆరుద్ర బలమైన ముద్ర వేశారని వైఎస్సార్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి అన్నారు. కడప రాజీవ్ కల్చరల్ క్లబ్‌లో శనివారం ఆరుద్ర శతజయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల సమర్పించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కవిగా, పండితునిగా, పరిశోధకునిగా, నాటక కర్తగా, విమర్శకునిగా ఆరుద్ర ప్రసిద్ధులన్నారు. ప్రధాన కార్యదర్శి జింకా సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షులు విద్వాన్ గానుగపెంట హనుమంతరావు, పొదిలి నాగరాజు మాట్లాడుతూ సినీ రచయితగా ఆయన పాటలు విశేషంగా ప్రాచుర్యం పొందాయని గుర్తు చేశారు. అనంతరం వెల్లాల వెంకటేశ్వరరాచారి కూడా మాట్లాడారు.

ఏడీకి వినతి

కడప ఎడ్యుకేషన్ : జిల్లాలో పని సర్దుబాటు విషయంలో ఉర్దూ మీడియం పాఠశాలలకు ఉర్దూ మీడియం ఉపాధ్యాయులను మాత్రమే కేటాయించాలని, ఉర్దూ చదవని ఉపాధ్యాయులను నియమించడం తగదని రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ కడప జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ముహమ్మద్ ఇర్షాద్, జాకీర్ హుస్సేన్, రాష్ట్ర సమన్వయకర్త ముహమ్మద్ అయ్యూబ్‌లు అన్నారు. ఈ మేరకు శనివారం జిల్లా విద్యా శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మునీర్‌ఖాన్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఉర్దూ మీడియం ఉపాధ్యాయులు అందుబాటులో లేనప్పుడు విద్యా వలంటీర్లను నియమించాలని కోరారు.

ముగ్గురిపై కేసు నమోదు

కడప అర్బన్ : కడప నగరంలోని తాలూకా పోలీస్‌స్టేషన్ పరిధిలో 'ఫాతిమా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఫిమ్స్)కు సంబంధించిన స్థలంలో పవన్‌కుమార్‌రెడ్డితో పాటు మరో ఇద్దరు కలిసి ప్రొక్లయినర్‌తో కంచెను తొలగించి కబ్జా చేసేందుకు ప్రయత్నించారు. ఈక్రమంలో కళాశాల ఏ.ఓ కమలాకర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కడప తాలూకా సీఐ వెంకటేశ్వర్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కడప కోర్టులో మెడికల్ క్యాంప్

కడప అర్బన్ : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆయుష్ శాఖ ఉచిత అవగాహన, వైద్య శిబిరం కార్యక్రమాన్ని కోర్టు ఆవరణంలో శనివారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికారసంస్థ చైర్మన్ జి. శ్రీదేవి విచ్చేశారు. డాక్టర్లచే న్యాయమూర్తులకు, న్యాయవాదులకు, న్యాయశాఖ సిబ్బందికి, ప్రజలకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆరవ అదనపు జిల్లా న్యాయమూర్తి షేక్ ఇంతియాజ్ అహ్మద్, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయసేవాధికారసంస్థ ఇన్‌ఛార్జ్ సెక్రటరీ ఎస్. ప్రవీణ్‌కుమార్, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి కె. ప్రత్యూషకుమారి, ఎక్సైజ్ కోర్టు జడ్జి హేమ స్రవంతి, మూడవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి జి. విజయలక్ష్మి, మొబైల్ కోర్టు జడ్జి ఎం. ఆశాప్రియ, కోర్టు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ టి. కృష్ణారావు, రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఆయుష్ జోన్–4 కడప డాక్టర్ ఎం. శేఖర్ రాజు, చెన్నూరు ప్రభుత్వ ఆయుష్ డిపార్ట్‌మెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ టి. రవికుమార్, మైదుకూరు ఆయుష్ విభాగం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కె. సునీత, చిలంకూరు ఆయుష్ విభాగం మెడికల్ ఆఫీసర్ సిహెచ్ పరిమళ, ఫార్మసిస్టులు సుమంత్, రాజశేఖర్, సుబ్బయ్య, విజయ పాల్గొన్నారు.



కడప కోర్టులో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీదేవి

పదోన్నతులు లేకుండా పని సర్దుబాటు చేయడం తగదు

కడప ఎడ్యుకేషన్ : రాష్ట్ర ప్రభుత్వం పురపాలక ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీలు చేపట్టకుండా కేవలం పని సర్దుబాటు చేయటం తగదని ఎస్టీయూ రాష్ట్ర పురపాలక కన్వీనర్ రవిశంకర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఇలియాస్ బాషా అన్నారు. శనివారం కడప ఎస్టీయూ భవన్‌లో మున్సిపల్ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ పాఠశాలలలో ప్రభుత్వం వెంటనే పదోన్నతులు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా మునిసిపల్ కన్వీనర్ అనిల్ కుమార్, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు మహబూబ్ బాష, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి బాబు పద్మాకర్, కడప రీజినల్ కన్వీనర్ అబ్దుల్ వాజిద్, కడప నగర అధ్యక్షుడు సాదిక్ అలీ, ప్రధాన కార్యదర్శి సంజీవ రాయుడు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర పురపాలక కన్వీనర్ రవిశంకర్‌రెడ్డి

ఉద్యోగుల హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వం

కడప ఎడ్యుకేషన్ : ఉద్యోగుల హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తూ పాత పెన్షన్ స్థానంలో కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని అమలు చేశాయని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మిరాజ, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయ కుమార్, పాలెం మహేష్ బాబులు అన్నారు. పాత పెన్షన్ విధానానికి ప్రత్యామ్నాయ విధానాలను అమలు చేసే ఆలోచనలను ప్రభుత్వం విడనాడాలని డిమాండ్ చేశారు. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరుతూ శనివారం యూటీఎఫ్ కడప జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షుడు రవికుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు గాజులపల్లె గోపీనాథ్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ లోతేటి శివశంకర్‌కు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న యూటీఎఫ్ నాయకులు

పురపాలక రంగంలో పనిచేయడం పెద్ద సవాలు

నగరపాలక సంస్థ కమిషనర్ వైఓ నందన్

కడప కార్పొరేషన్ : పురపాలక రంగంలో పనిచేయడం అతిపెద్ద సవాలని కడప నగరపాలక సంస్థ కమిషనర్ వైఓ నందన్ అన్నారు. కార్పొరేషన్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎస్ఈ రత్నాల రాజు పదవీ విరమణ సత్కార సభ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 62 ఏళ్ల వయసులో కూడా ఎస్ఈ రత్నాల రాజు ఒక యువకునిలాగా పనిచేశారని, కడప నగరాభివృద్ధికి కృషి చేశారన్నారు. 42 ఏళ్లపాటు మున్సిపల్ రంగంలో వివాదాలు, ఆరోపణలు లేకుండా పనిచేయడం సామాన్యమైన విషయం కాదన్నారు. అనంతరం ఎస్ఈ రత్నాల రాజు మాట్లాడుతూ డిప్లమో చదివిన తాను ఏఈగా బ్రిటీషు సంస్థ ఆధ్వర్యంలో విశాఖపట్నంలో మురికివాడల్లో పనిచేసిన అనుభవాన్ని గుర్తుచేసుకున్నారు. హుదూద్ తుఫాను సమయంలో డీఈగా పనిచేసిన అనుభవం మరచిపోలేనన్నారు. విధి నిర్వహణలో ఎవరినైనా నొప్పించి ఉంటే మన్నించాలని కోరారు. అనంతరం ఎస్ఈ రత్నాల రాజు దంపతులను కమిషనర్, ఉద్యోగులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ రాకేష్ చంద్రన్, డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు, ఎంహెచ్ఓ డా. చంద్రశేఖర్, డీసీపీ సూరజ్ కుమార్, పబ్లిక్ హెల్త్ ఈఈ చెన్నకేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎస్ఈ రత్నాల రాజు దంపతులను సన్మానిస్తున్న నగరపాలక సంస్థ కమిషనర్ వైఓ నందన్

లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలి

కడప కార్పొరేషన్ : కడప నగరంలో లోతట్టు ప్రాంతాలలో వర్షపు నీరు నిలవకుండా కాలువల్లో ఉన్న అడ్డంకులను తొలగించాలని నగరపాలక కమిషనర్ వైఓ నందన్ ఆదేశించారు. శనివారం ఆయన మార్నింగ్ విజిట్‌లో భాగంగా అల్మాస్‌పేట జంక్షన్, మార్కెట్ యార్డు జంక్షన్, గౌస్ నగర్ ప్రాంతాల్లో పర్యటించి పారిశుద్ధ్యం, ఇంజినీరింగ్ పనులను పరిశీలించారు. అల్మాస్‌పేట జంక్షన్ పనులను వెంటనే పూర్తి చేయాలని సూచించారు. కడప మార్కెట్ యార్డు జంక్షన్ పనులను వెంటనే ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కోటిరెడ్డి సర్కిల్‌లో కొత్తగా నిర్మించిన స్టాంగ్ వాటర్ డ్రైన్‌లో పెద్ద మొత్తంలో ఉన్న చెత్తను గమనించి శుభ్రం చేయించారు. గౌస్ నగర్‌లో ఇళ్ల మధ్య ఉన్న కాలువలకు అడ్డుగా ఉన్న వాటిని తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ కే.రాకేష్ చంద్రన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సునీల్, సిబ్బంది పాల్గొన్నారు.



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న నగరపాలక సంస్థ కమిషనర్ వైఓ నందన్

గుడ్లవల్లేరు ఘటన బాధ్యులను శిక్షించాలి

కడప ఎడ్యుకేషన్ : గుడ్ల వల్లేరు ఘటనలో బాధ్యులను శిక్షించాలని గ్రేటర్ రాయలసీమ విద్యార్థి యువజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.ఎం. ఓబులేసు యాదవ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన శనివారం కడపలో మీడియాతో మాట్లాడుతూ గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల బాలికల హాస్టల్ వాష్ రూమ్స్‌లలో 28 సీక్రెట్ కెమెరాలు పెట్టి 300 పైగా వీడియోలు రికార్డ్ చేయడం దుర్మార్గమన్నారు. ఈ చర్యలకు పాల్పడిన దుర్మార్గులను కఠినంగా శిక్షించాలన్నారు.

జలమయం



చెరువును తలపిస్తున్న ఆర్టీసీ బస్టాండు ఆవరణం

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఆర్టీసీ బస్టాండు చిన్నపాటి చెరువును తలపిస్తోంది. వర్షపునీరు బయటికి వెళ్లేందుకు మార్గం లేకపోవడంతో నీరు బస్టాండులోని ప్లాట్‌ఫారాలను తాకుతోంది. దీంతో ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉదయం నుంచి ప్రజలు వివిధ ఊర్లకు వెళ్లేందుకు బస్టాండుకు చేరుకోగానే వర్షపు నీరు దర్శనమివ్వడంతో ఇబ్బందులు పడ్డారు. ఈ విషయంగా ఆర్టీసీ అధికారులు పట్టించుకోకపోవడంపై ప్రయాణీకులు తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు.

పైపులైన్ లీకేజీ.. తాగునీరు వృథా



జర్నలిస్టు కాలనీలో పైపులైన్ లీకేజీ వల్ల బురదమయంగా మారిన రోడ్డు

కడప కార్పొరేషన్ : కడప నగరంలోని రామాంజనేయ పురం పరిధిలో ఉన్న జర్నలిస్టు కాలనీలో పాత వాటర్‌ప్లాంటు ఎదురుగా పైపులైన్‌కు లీకేజీ ఏర్పడింది. ఫలితంగా వారం రోజులుగా తాగునీరు వృథాగా పోతోంది. కాలనీకి తాగునీరు సరఫరా అయిన ప్రతిసారీ నీరు వృథా అవుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఇక్కడ పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి ఉండటం వల్ల లీకేజీ ఎక్కడ ఏర్పడిందో కూడా తెలియడం లేదు. నగరపాలక అధికారులు స్పందించి పైపులైన్ బాగు చేయించాలని వారు కోరుతున్నారు.